క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా...



చిలకలూరిపేట: పల్నాడు జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన డాక్టర్ విద్యాసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు చీరాల రోడ్డులో ఉన్న జిల్లా కార్యాలయంలో డాక్టర్ విద్యాసాగర్‌కు నియామక పత్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మురికిపూడి ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన విద్యాసాగర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఎ కార్యక్రమంలో డాక్టర్ పి.హరిప్రసాద్, డాక్టర్ మురళీచంద్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా...



ఈపూరు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కేఆర్ కాలేజీలో ఈ నెల 26న జరిగి న పల్నాడు జిల్లా కౌన్సి ల్ సమావేశంలో నూతన కార్యవర్గ కమిటీ ఎంపికలో రాష్ట్ర కౌన్సిలర్‌గా ఈపూరు మండలం నుంచి జి.నాగరాజు (ఎంపీపీ పాఠశాల, ఈపూరు) ఎన్నికైనట్లు మండల యూటీఎఫ్ అధ్యక్షులు బి.భాస్కరరావు, ప్రధానకార్యదర్శి ఎస్‌కే యాకుబ్‌లు సోమవారం తెలిపారు. అలాగే వినుకొండ ఏరియా నుంచి జిల్లా కార్యదర్శులుగా ఎం.రవిబాబు, ఆర్. అజయ్ కుమార్‌లు తిరిగి ఎన్నికైనట్లు వివరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు యూటీఎఫ్ మండల నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులుగా ..





వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులుగా వినుకొండ ప్రాంత ఉపాధ్యాయులు ఎం. రవిబాబు, ఆర్.అజయ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ మేరకు వినుకొండప్రాంతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన అభినందన సభలో నూతనంగా ఎంపికైన ఇరువురికి స్థానిక నాయకులు అభినందనలు తెలియజేసి సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గౌరవాధ్యక్షులు రామిరెడ్డి, బీమ్లా, అచ్యుత్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యర్థాల్లో రగిలిన మంటలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సమీపంలోని ప్రసన్న వంశీ స్పిన్నింగ్ మిల్లు వద్ద రోడ్డు ప్రక్కన వేసిన వ్యర్థాల్లో మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగలు జాతీయ రహదారిని కమ్మేశాయి. కంపెనీ సిబ్బంది చిలకలూరిపేట అగ్నిమాపక శాఖకు సమాచారమివ్వటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆ శాఖ సిబ్బంది మంటలను అదుపుచేశారు. వ్యర్థాలను తగలబెట్టడం వలన చెలరేగే మంటల కారణంగా కంపెనీ అంటుకుని పెనుప్రమాదం తలెత్తే అవకాశం ఉందని సిబ్బంది పేర్కొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఖాళీగా ఉన్న తొమ్మిది వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు మార్చి రెండోతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్ సచివాలయాల్లో పొందుపర్చామన్నారు.

పన్నులు వసూలు చేయండి

నరసరావుపేట: బకాయి ఉన్న ప్రతి అసెస్‌మెంట్ దారుడు పన్ను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు ఆదేశించారు. కౌన్సిల్‌హాలులో సోమవారం రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆస్తిపన్ను, నీటిచార్జీల వసూళ్లపై సమీక్ష చేశారు. డీఈ శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్, ఆర్‌ఐ సూర్యనారాయణరెడ్డి, ఏఇలు, పిట్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ క్యాంపస్‌లోని సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకాని క్యాంపస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాదరాజు మాట్లాడుతూ నూతన క్యాంపస్ నిర్మాణం పట్ల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా



వేల్పూరులో కర పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వేలూర్పులో కొనసాగిన గడప గడపకు కార్యక్రమం

శావల్యాపురం: రాష్ట్రంలో అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడిగా నిలిచారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని వేల్పూరు గ్రామం ఎస్సీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుని నవరత్నాల బుక్‌లెట్‌ను అందజేసి లబ్ధిని వివరించారు. కాలనీవాసులు బ్రహ్మన్నకు పూలతో బ్రహ్మరథం పట్టారు. కాలనీలో విద్యుత్ వైర్లు సక్రమంగా లేవని ఎమ్మెల్యే దృష్టికి తేగా స్పందించి తక్షణమే ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. కాలనీవాసీ జుంజు చిన బాలయ్య అనారోగ్యంతో బాధపడుతున్న వైనాన్ని కుటుంబ సభ్యులు చెప్పగా, ఎమ్మెల్యే స్పందించి గుంటూరు జీజీహెచ్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఫోన్‌లో సూచించారు. కాలనీవాసులకు ఇంటి స్థలాల కోసం కాలనీలో రెండు ఎకరాలు భూమిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరిశీలించారు. అనంతరం తహసీల్దారు షేక్ జాన్‌సైదులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారని, కానీ పేదలు పేదలుగానే ఉండాలని ఎల్లో మీడియా, ప్రతిపక్ష పార్టీలు అప్పుల భారమంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు రూ. లక్షల కోట్లు అప్పులు చేసి మలేషియా, సింగపూర్ దేశాలకు తరలించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి రూపాయి పేదల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ఉప సర్పంచ్ మారాసు రామయ్య, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జుంజు సుబ్బారావు, వేల్పూల రామయ్య, బీర్నేడి రవి, బోయలపల్లి ఆనందరావు, బీర్నేడి రత్నగిరి, పంచాయతీ కార్యదర్శులు కొమటినేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పదోతరగతి ఫలితాల్లో సత్తాచాటండి

విద్యార్థులకు సూచించిన నడికట్టు రామిరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న రామిరెడ్డి

నాదెండ్ల: రానున్న పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటి ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. పల్నాడు జిల్లాలో తమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా, ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధమవ్వాలన్నారు. విద్యార్థులు పోటీతత్వంతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పది పూర్తయిన విద్యార్థులు తమ గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్‌తో పాటూ వృత్తివిద్యా కోర్సులు చదవొచ్చన్నారు. పదో తరగతి మైలురాయిలో మంచి ఫలితాలతో మెరుగైన ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలన్నారు. ఆయనతో పాటూ హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో వేగవంతంగా రీసర్వే





తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన హద్దురాళ్లు

వివరాలు వెల్లడించిన రొంపిచర్ల తహసీల్దార్

రొంపిచర్ల: మండలంలో జగనన్న భూ శాశ్వత హక్కు పథకం రీసర్వే కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని తహసీల్దార్ అంకారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇప్పటికి 6 రెవెన్యూ గ్రామాల్లో ఈ సర్వే కార్యక్రమం పూర్తి అయ్యిందని మండల సర్వేయర్ జి. భాగ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 100 సంవత్సరాల తరువాత మహాయజ్ఞంగా జగనన్న సమగ్ర భూసర్వే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మండలంలోని మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో కూడా ఈసర్వే కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందన్నారు. రీసర్వే వల్ల రైతులకు పలు ప్రయోజనాలు ఒనగూరతాయన్నారు.

సర్వే కార్యక్రమంలో మండలంలోని సర్వేయర్‌లతో పాటు 40 సర్వేయర్‌లు నిత్యం సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే పూర్తి అయిన గ్రామాల్లో పొలాల హద్దులకు రాళ్లు నాటేందుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా రాళ్లను ఏర్పాటు చేసిందన్నారు. హద్దు రాళ్లు కూడా తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. మండలంలో నిర్వహిస్తున్న రీ సర్వేకి రైతులందరూ సహకరించి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బొల్లాపల్లిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బొల్లాపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు, సైన్స్ ద్వారా మన సమస్యల పరిష్కారం గురించి వ్యాసరచన పోటీలు, ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తల గురించి వక్తృత్వ పోటీలు, సైన్స్ క్విజ్ పోటీల్లో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచంలో అత్యున్నతమైనటువంటి నోబెల్ బహుమతి సర్ సీవీ రామన్‌కు ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28 కావడంతో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామని ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.చలపతిరావు తెలిపారు. ఆయా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన ఆర్. స్వరూపాబాయి, పి. సునీల్‌రెడ్డి, సీ.హెచ్.భవాని, భద్రకాళీశ్వరి, ఎస్.మహేశ్వరి, పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, షేక్ షిరాజున్నీసా, వి.నాగమణి, వరప్రసాద్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

నరసరావుపేట రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ములకలూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజా (33) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన బంధువైన షేక్ మాబూవలితో కలిసి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వచ్చారు. ఇంటికి వెళ్లే క్రమంలో ములకలూరు గ్రామంలోని మెయిన్‌రోడ్డుపై చర్చి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ ఖాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మాబూవలికి తీవ్రగాయాలు కావడంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఖాజాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరాల్సిన ఖాజా విగతజీవిగా రోడ్డు మీద పడి ఉండటాన్ని చూసి భార్య, కుమార్తెలు, బంధువులు కన్నీరుమున్నీరై విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్‌కు తీవ్ర గాయాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్తెనపల్లిలోని గండ్లూరు గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ గీత అలియాస్ గోపి ఆరు నెలలుగా గణపవరంలోని రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటోంది. ఈ నెల 25న రాత్రి 9 గంటల సమయంలో చిలకలూరిపేట నుంచి ఆటోలో వచ్చి రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటే క్రమంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. తీవ్రగాయాలైన గీతను అప్పట్లో 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

అరుణాచలంకు ప్రత్యేకబస్సు

నరసరావుపేట: పట్టణ, పరిసర గ్రామాల్లోని భక్తులు, యాత్రాభిలాషుల కోసం స్థానిక డిపో నుంచి మార్చి ఏడవ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం స్పెషల్ హైటెక్ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సోమవారం వెల్లడించారు. ఈ బస్సు ఐదవతేదీ రాత్రి 10 గంటలకు డిపో నుంచి బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుంటూ అరుణాచలంకు చేరుతుందన్నారు. అక్కడ భక్తులు గిరిప్రదక్షిణ చేసుకుని ఏడవతేదీ సాయంత్రం బయలుదేరి నరసరావుపేటకు ఎనిమిదవ తేదీ ఉదయం నాలుగు గంటలకు చేరుకుంటారన్నారు. టిక్కెట్టు వెల ఒక్కొక్కరికీ సూపర్ లగ్జరీ బస్సునకు రూ.2750 అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7382896041, 7382896038, 9959225428లను సంప్రదించాలని కోరారు.

రొంపిచర్లలో ఎమ్మార్పీఎస్ పాదయాత్ర

రొంపిచర్ల: ఎస్సీ వర్గీకరణ కొరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం మండలానికి చేరుకున్నది. రెండవ రోజు ఈ పాదయాత్ర మండల కేంద్రమైన రొంపిచర్లకు చేరుకుంది. పాదయాత్రలో పాల్గొన్న నాయకులకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ అద్దంకి బాబు మాట్లాడుతూ తమ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పాదయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముక్కెన పుట్టయ్య, మండల నాయకులు కాకాని యేసురాజు, శ్యామ్, రాజశేఖర్, మొండితోక శ్రీను, మొండితోక రమేష్, వడ్లమూడి బాబు, కొమ్ము ప్రకాష్, పేరుపోగు నరేష్, వడ్లమూడి అశోక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు నోటిఫికేషన్

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ ప్రాజెక్టు వినుకొండ కార్యాలయం పరిధిలో గల నూజెండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ సహాయకురాలు ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ సోమవారం తెలిపారు. నూజెండ్ల మండలంలోని మారెళ్లవారి పాలెం 1 (బీసీ-డీ), పాత చెరుకుంపాలెం (జనరల్), ఫువ్వాడ 2 (బీసీ-బీ) ఖాళీలు ఉన్నట్లు ఆమె వివరించారు. అర్హులైన అభ్యర్థులు అర్హత కలిగిన పత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 2వ తేదీ లోపు వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

టెన్నిస్ విజేతలకు బహుమతి ప్రదానం



నరసరావుపేట ఈస్ట్: సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల క్రీడా ప్రాంగణంలో నరసరావుపేట టెన్నిస్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నరసారెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలలో 65 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. అండర్-12 విభాగంలో వై.నీరజ్‌రెడ్డి ప్రధమ, ఎస్.శశిప్రియ ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే పురుషులు డబుల్స్‌లో శేషు, చిన్న (నరసరావుపేట) ప్రధమ, మణి, జగదీష్ (కావలి), 45 సంవత్సరాలు విభాగంలో ప్రసాద్, వంశీ (కావలి), నరసారెడ్డి, వెంకట్ (నరసరావుపేట), 55 సంవత్సరాల విభాగంలో పాండు, రామకృష్ణారెడ్డి (ఒంగోలు), డాక్టర్ జి.వి.మోహన్ రెడ్డి, శివారెడ్డి (గిద్దలూరు), 65 సంవత్సరాల విభాగంలో కె.మోహనరెడ్డి, డాక్టర్ రత్తయ్య(కనిగిరి), ఎం.ఎస్.ప్రసాదు, శశిభూషణ్ (నరసరావుపేట) ప్రధమ, ద్వితీయ స్థానాలను సాధించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మిరియాల ప్రసాదు, టోర్నమెంట్ ఇన్‌చార్జ్ క్రోసూరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గొరిజవోలులో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం



నాదెండ్ల: గొరిజవోలు గ్రామంలోని బొడ్డురాయి (నాభిశిల) గొడరాళ్లు, పురాతన ఆలయాలైన అంకమ్మగుడి, పోలేరమ్మ గుడి, పోతురాజు విగ్రహాలకు సోమవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1951లో నిర్మించిన ఈ ఆలయాలు ప్రస్తుతం రోడ్డుకన్నా దిగువకు పోయాయి. శిథిలావస్థకు చేరిన ఆలయాలు, లోతట్టుకు చేరిన బొడ్డురాయి జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫిరంగిపురానికి చెందిన నారాయణం ప్రసాదంచార్యులు, పర్చూరి మాధవస్వామి, రత్నాకరం రాఘవశాస్త్రి బృందం బొడ్డురాయి వద్ద శిథిలావస్థకు చేరిన ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొందరు దంపతులు పీటలపై కూర్చుని సంప్రదాయబద్ధ మేళతాళాలతో గోమాత సహకారంతో పనులు ప్రారంభించారు. బొడ్డురాయి, గొడరాళ్ళతో పాటూ అంకమ్మగుడి, పోలేరమ్మగుడి, పోతురాజు విగ్రహాలను తొలగించి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా భద్రపరిచారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమాలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. త్వరలో పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు.

సృజనాత్మకతను వెలికితీయవచ్చు

శావల్యాపురం: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్సు ప్రదర్శన దోహదపడుతుందని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. సోమవారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవ ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు జాన్‌సైదులు మాట్లాడుతూ సైన్సు పితామహుడైన సి.వి.రామన్ కనుగొన్న సంఘటనకు గుర్తుగా జాతీయ సైన్సు దినోత్సవం జరుపుకోవటం మంచి శుభాపరిణామమన్నారు. విద్యార్థులు తమ ఆలోచనా శక్తికి పెంపొందించుకోవటంతో పాటు జీవితాలలో ఉన్నత స్థానాలకు చేరుతారన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శన చాయాచిత్రాలను తిలకించి అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పాఠశాల కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చంద్, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, పోట్లూరు ఏడుకొండలు, ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి,అజిత్‌చంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్

ఇస్రో శాస్త్రవేత్త వై.శివప్రసాద్

నరసరావుపేట రూరల్: నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలని ఇస్రో శాస్త్రవేత్త వై.శివప్రసాద్ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలను చిల్డ్రన్స్ సైన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ నోబెల్ బహుమతి సాధించడం ద్వారా దేశంలో సైన్స్ రంగంలో సీవీ రామన్ విశేష మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దేశ అంతరిక్ష పరిశోధన రంగంలో అగ్రగామిగా నిలవడానికి విక్రమ్‌సారాభాయ్, అబ్దుల్ కలాం చేసిన కృషిని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యువత పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో రాణించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ, చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ శాంతమూర్తి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ సలహాదారుడు డాక్టర్ అన్నవరపు కుమార్
- కృష్ణవేణిలో అవగాహన సదస్సు



విదేశీవిద్యపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అన్నవరపు కుమార్

నరసరావుపేట ఈస్ట్: విదేశాలలో ఉన్నత చదువుల పట్ల ఆసక్తి గల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ సలహాదారుడు డాక్టర్ అన్నవరపు కుమార్ తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సోమవారం విదేశీ విద్య-అవకాశాలు అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం విదేశీవిద్య కోసం అందించే ప్రోత్సాహకాలు, విద్యార్థులకు గల అవకాశాలను వివరించారు. అలాగే విదేశాలలో గల ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, కంప్యూటర్ విభాగాధిపతి టి.సురేఖ, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి షేక్.సర్ధార్, డాక్టర్ యోగేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మొహిద్దీన్ సాహెబ్

రొంపిచర్ల: 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ ఈ ఏడాది జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. పదవ తర గతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్ల వద్ద ప్రశాంత వాతావరణం కల్పించి చదువుకునే విధంగా చేయాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ వివరాలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో ఇటీవల జరిగిన పరీక్షలలో పదవ తరగతి విద్యార్థులకు వచ్చిన మార్కులను సబ్జెక్టుల వారీగా తల్లిదండ్రులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.